# దర్గామిట్ట కతలు

పెద్దాస్పత్రి అన్నమ్మ మా యింటికొచ్చి పురుడుబోస్తే నేను సుకంగా పుట్టేసినానుగానీ ఆనేక నా పేరు బెట్టడమే పెద్ద రచ్చయిపొయ్యిందంట. ఒక రోజు గాదు, రొండు రోజులు గాదు మొత్తం మూడు రోజుల రచ్చంటది. నాకిప్పుడు యిర్వై ఏడేళ్లొచ్చాయిగానీ మా నాయిన రెండువందల దెబ్బయిమార్లన్నా యీ కత జెప్పి మమ్మల్ని నవ్విపించివుంటాడు...

పాతశెట్టి కొట్టుకాణ్ణుంచి మూడీశల కలకండ తెచ్చి మంచి మద్యాన్నంపూట నట్టేంట్లో గుమ్మరించి బోశాడంట మా నాయిన.

ఆ రోజు శుక్రోరం. మాకు మంచి రోజు.

'లడ్లు చేసేదానికి మిల్లుకాడ రెడ్డి డబ్బులివ్వలేదుగానీ దీన్నే సదరంగా గెడ్డలు కొట్టిబెట్టు. సాయింత్రం నేనొచ్చినాక పేరుబెట్టి తలా ర్యాంత పంచేద్దాం' అన్నాడంట మా నాయినమ్మతో.

నవారు మంచం మింద తలకు పట్కా గట్టుకోనున్న మా అమ్మ నాకు పాలిస్తా వుందంటనేగానీ మరేదకైనా తలెత్తి కలకండ తట్టు చూళ్లా.

చూసేం ఫాయిదనీ? ఏదన్నా మాట చెప్పబోతే ఈ అమ్మాకొడుకులు చీమతో సమానంగా యిదిలించ బోతారని, వాళ్ల పోడు పట్టకుండా గమ్మున నాకు పాలిస్తా వుండి పొయ్యిందంట.

'అదేందిరబయా! లడ్లు జేయకుండా బిడ్డకు పేరు బెట్టేది మనిళ్లల్లో వుందా? తొలిబిడ్డకు లడ్లు పంచి రొండో బిడ్డకు కలకండ పంచితే నావుర్దాగదా' అనిదంట మా నాయినమ్మ- మొకం అయిదు పైసల బిళ్లంత జేసుకుంటా.

మా నాయినకు సర్రన ఎక్కింది కోపం.

'నువ్ బోయి తేబోమే మీతాత కాణ్ణుంచి. అవుతల మిల్లుకాడ పని కాలేదుమే అని ఒక తట్టు జెప్తావుంటే- లడ్లకు డబ్బులాణ్ణుంచొస్తాయా? నెల రోజులుగా చేతిలో పనుల్లేవు, కమ్మీలు కుదవబెట్టి కానుపు జేయించాము... బిడ్డకు నాలుగు గుడ్డ ముక్కలయినా లేవు, అన్నీ చూస్తానే వుంటావు, అడగలానే వుంటావు. యీలుగాకనేగదా కలకండ తెచ్చింది? ఈసారికిట్టా గానీ. ఉయ్యాల్లో ఏసేప్పుడు ఘనంగా జేద్దాం' అన్నాడంట అన్నం తినేదానికి కూర్చుంటా.

మా నాయినమ్మ మళ్ల మాట్లాడకుండా సామాన్ల బుట్టలోంచి సుత్తి తీసుకుంటా కలకండ ముందు గొంతుకూచ్చునింది.

'పేరేదన్నా అనుకున్నావా? ఎతకమంటావా?' అనింది కలకండని గెడ్డలు కొడతా.

'నువ్ జూసి పెట్టు. నేనొచ్చినాక ఖాయం జేద్దాం' అని, అన్నం తిన్నాక అదరాబదరా ఎళ్లిపోయినాడు మా నాయిన.

ఆ పోవడం పోవడం సందేళదాకా పత్తాలా.

ఆరయ్యింది, ఏడయ్యింది, మనిషిరాడు.

'యీడు పనిలోబడితే దీన్‌దునియా తెలీకుండా బోద్దిగదా. బిడ్డకు పేరుబెట్టే ఏళైపోతా వుందే' అని, గబగబా వజూ చేసుకొని పేరెతికే దానికి ఖురాన్ తెరిచింది మా నాయినమ్మ.

అప్పటిదాకా పట్టనట్టున్న మా అమ్మకు అనుమానం గెంటకొట్టింది.

'వెమ్మా! పేరుగావాలంటే వుళ్లెప్పుడైనా పెట్టు కోవచ్చుగానా ఆయిన రాకుండా ఏం చేయబాకా. నాతో చెప్పకుండా చేస్తారా అని బొచ్చులు పగల్నాకి నీ మింద కోపం నా మింద తీర్చుకుంటే తట్టుకోలేను తల్లా' అని ఎచ్చరించింది.

ముసిల్ది యింటేనా?

ఖురాన్ని అటుదిప్పి యిటుదిప్పి కడాకు పేరుబెట్టేసింది. అంతటితో ఆగకుండా పక్కింటి ఛోటేబా చినకొడుకుని పిలిచి, 'రే.. అబయా. నా మనవడికి మహమ్మద్ ఖదీర్ అహ్మద్ అని పేరుబెట్టినామని జెప్పి

## నా పేరుబెట్టింది మీసాల సుబ్బరాజు!



యీదిలో వాళ్లందరికీ కలకండ పంచిరాబో' అని ట్రే యిచ్చి పంపించేసింది.

వాడట్టా కదిల్నాడు. మా నాయినిట్టా దిగబడినాడు.

యింక జూడాలి. రావం దాడి.

'నేనొచ్చే తలికే ఏమా తొందరా? నేను సరేననకుండా పేరెట్టా బెట్టినావు? మిల్లుకాడ నేను మరాయించు కుంటా వుంటే నువ్విడెట్టా మిుగిస్తావు? చెప్పు హరాందానా... యింతకెట్టా తెగించినావు, కలకండెట్టా పంచినావు?' అని యింతెత్తున ఎగిరి, ఇంట్లో మిగిలిన కలకండనంతా కాలితో తన్ని, మా నాయినమ్మని మూడు పగళ్లు మూడు రాత్రిళ్లు సాదిస్తా కూర్చున్నాడు.

మా నాయిన బాదంతా నాకు పేరు పెట్టినందుకుగాదు, యిట్టాంటి నోరు తిరగని పేరు పెట్టినందుకు. ఖదీర్‌లో 'ఖ'ని- 'ఖ' అనగూడదూ 'క' అనగూడదూ గొంతులో నీళ్లు బోసుకొని గరగరలాడిస్తామే- అట్లా అంటా 'ఖ' అని పలకాలా (ఎట్టాజెప్పేదిరా మాలా).

మా బందువుల పిలకాయల్లో నోరుతిరగని పేరు ఎవురికి పెడతా వున్నా మా నాయిన అడ్డం పడతా వుంటాడు. 'మన పేర్లు పలకలేక హిందువులు సస్తా వుంటారు. వాళ్లగ్గాడా నోరు తిరిగేట్టు పెడితే మీ సొమ్మేం పోద్దిమే' అని దబాయిస్తా వుంటాడాయన. యిట్టాంటి నోరు తిరగని పేర్లుండబట్టే మా ఆడోళ్లంతా పేర్లేలేకుండా బోయినట్టు 'బూబమ్మ', 'బీబీ'లయి పోయారని అదేందో ఆయనకు నమ్మకం.

అంతదాకా ఎందుకా? మా నాయిన పేరు దస్తగిరి అహ్మద్. యింట్లో పిలిచే పేరు కరీముల్లా షరీఫ్. కావల్లో కొత్తగా కరెంటు పని మొదలుబెట్టినప్పుడు స్నేయితులకూ రెడ్లకూ పలికేదానికి కష్టంగా వుందనీ 'కరీం'గా పేరు కత్తిరించేసుకున్నాడు. దాంతోటే పేరుబడ్డాడు. అట్టాంటోడు ఆయనకు బుట్టినోడికి నోరు తిరగని పేరు పెడితే ఊరుకుంటాడా?

మా నాయిన సాదింపు పళ్లేక 'దేవుడి పేరుబెట్టి కూడా యీ నా కొడుక్కి లోకువైపోయానే. సరిగ్గా పిలవాలను కోవాలేగానీ యీ పేరు పలకడం కష్టమా? హిందువుల పేర్లన్నీ మననోళ్లు తిరిగేటట్టే వున్నాయా? యీడి పెడ్రదం నాశినంగాను' అని మా మేనత్త యింటికి దబ్బాయించేసి ఆణ్ణే నెల్రోజులపాటు వుండిపోయిందంట మా నాయినమ్మ.

అయితే అంతటితో కతయిపోలా.

ఇది జరిగిన నాలుగేళ్లకు మా నాయిన నా పేరు గురించి ఎట్టయితే బాదపడినాడో మీసాల సుబ్బరాజు గూడా అట్టే బాదపడినాడు.

ఆయన మా యిద్యానికేతన్ కాన్మెంట్ కరెస్పాండెంటు. మా నాయినకు మంచి స్నేయితుడు.

'ఇదేందయ్యా కరీం సాయిబా. ఇట్టాంటి పేర్లన్నీ మా నోళ్లు తిరిగేదానికేనా?' అన్నాడంటాయన రిజిస్టర్లో నా పేరు రాసే ముందు.

'మా అమ్మ చేసిన పనిభాయ్. ఏం చేసేది చెప్పు' అన్నాడు మా నాయిన మళ్లా బాదపడతా.

మీసాల సుబ్బరాజు మీసం దువ్వుకుంటా ఆలోచించినాడు.

'ఒక పనిచేద్దాం. పేరు చివర అహ్మదు తీసేసి 'బాబు' అని బెడదాం. ఖదీర్ నోరు తిరక్కపాయినా బాబు అనయినా పిలుస్తారుగదా. పైగా ఫ్యాషను' అన్నాడు.

అనడమేగాదు రిజిస్టర్లో అట్టాగనే అచ్చుగుద్దినట్టు రాసేసినాడు.

మా నాయిన బలే కుషీ అయిపోయినాడు.

ఆనాటి నుంచి ఈనాటి దాకా నన్ను 'ఖాదర్' అన్నా, 'ఖాధీర్' అన్నా, నా మార్కుల లిస్టులో 'కాదిర్' అని బడినా, మా మురలీ వాళ్ల చినమామ్మ నన్ను పూర్తు పేరు జేసి 'కదిరి' అని పిలిచినా 'బాబు' మాత్రం తప్పుల్లాకుండా వుండిపోయింది.

అంతా మీసాల సుబ్బరాజు పుణ్యం.

-మహమ్మద్ ఖదీర్‌బాబు